## క్లుప్తంగా

### ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని వైఎస్సార్ కూడలిలో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆంజనేయ జయంతి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చినకుదమ గ్రామంలో ప్రకృతి వ్యవసాయం, నవధాన్యాల సాగుపై గురువారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రకృతి సాగు ద్వారా నాణ్యమైన పంట అధిక దిగుబడులు వస్తాయన్నారు. తక్కువ పెట్టుబడితో తక్కువ కాలంలో ఎక్కువ పంటలు పండించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సిబ్బంది స్వామినాయుడు, గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం కాకడహారతి, సుప్రభాతసేవ, పాలాభిషేకం వంటి కార్యక్రమాలు చేశారు. విజయవాడ భజన బృందం వారిచే అఖండ సాయినామ సంకీర్తన, సామూహిక కుంకుమ పూజలు చేపట్టారు.

### యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

జియ్యమ్మవలస: యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో కె.ధర్మారావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది గురువారం యోగాసనాలు వేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఉదయం, సాయంత్రం యోగా చేసుకోవాలని, ఇలా యోగా సాధన ద్వారా ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీవో తులసీదాస్ పాల్గొన్నారు.

### నేడు ట్యాంకుబండ్‌పై యోగాంధ్ర

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి ప్రాజెక్టు సమీపంలోని ఐటీడీఏ పార్కు దగ్గరలోని ట్యాంక్‌బండ్‌పై యోగాంధ్ర కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు పి.బాల ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జరుగుతున్న ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు.

### నిరుపయోగంగా గొడౌన్లు



వినియోగానికి దూరంగా ఉన్న గొడౌన్లు

భామిని: మండల కేంద్రంలో నిర్మించిన సివిల్ సప్లెస్ గొడౌన్‌లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా నిర్మించిన గొడౌన్‌లలో పౌరసరఫరాల శాఖ ఎటువంటి సరుకులు ఉంచడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గొడౌన్‌లను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

### క్లోరినేషన్ చేయండి..



ఎంపీడీఓ వెంకటరమణ

వీరఘట్టం: రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నందున మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించాలని ఎంపీడీఓ బి.వెంకటరమణ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలన్నారు. అలాగే యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించి ఆ ఫోటోలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. వీరఘట్టం అంబేడ్కర్ జంక్షన్ నుంచి ఆస్పత్రి జంక్షన్ వరకు రోడ్డుకిరువైపులా చోటుచేసుకున్న ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు.

### ఘనంగా లక్ష్మీనృసింహస్వామికి ముడుపుల పూజలు



లక్ష్మీనృసింహస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు

సీతానగరం: మండలకేంద్రంలోని సువర్ణముఖి నదీ తీరాన ఉన్న లక్ష్మీనృసింహస్వామికి గురువారం ముడుపుల పూజలు చేశారు. ప్రతివారం జరుగుతున్న ముడుపుల పూజల్లో భాగంగా భక్తులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి పాల్గొంటున్నారు. అర్చకుడు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ స్వామివారిపై ఉన్న విశ్వాసం కొద్దీ విశాఖ, అనకాపల్లి, రాయగడ రాయ్‌పూర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి పూజల్లో పాల్గొంటున్నారన్నారు.



### ● అధ్వాన రహదారితో అవస్థలు..

మండలంలో మారుమూల ప్రాంతమైన గుడ్డిమీదగూడ – కడగండి గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. సిమెంట్ రహదారి పెచ్చులూడిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులేర్పడుతున్నాయని స్థానిక గిరిజనులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో పక్కన ఉన్న కొండపై నుంచి కొండ చరియలు సైతం విరిగి రోడ్డుపైన పడుతున్నాయని..అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. – సీతంపేట



### ● కల్యాణం..కమనీయం..

పాలకొండ నగర పంచాయతీ పరిధిలోని కొండాపురం గ్రామ సమీపంలో ఉన్న పంచముఖ రుద్ర గాయత్రీ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల కల్యాణం కనులపండువగా చేపట్టారు. ఆలయ ప్రధానార్చకుడు బంకుపల్లి చిట్టిబాబు శర్మ ఆధ్వర్యం జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. – పాలకొండ



### ● ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన..

హనుమాన్ జయంతి వేడుకలు పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా ఎంతో వైభవంగా కొనసాగుతున్నాయి. స్థానిక దక్షిణాముఖ ఆంజనేయస్వామి మందిరంలో అర్చకులు సూర్యారావు, రవిబాబు, కిశోర్ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన భారతీయ నృత్య శిక్షణ సంస్థ నిర్వాహకులు నివేదిత శ్రీకాంత్‌లో పర్యవేక్షణలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. – పాలకొండ రూరల్

# బిల్లుల చెల్లింపుల్లో జాప్యం!

- ఉపాధి పనులు చేసి 6 వారాలైనా చేతికందని డబ్బులు
- గోశాలలు, నీటితొట్టెలు, ఫారంపాండ్‌ల నిర్మాణదారులదీ అదే పరిస్థితి..
- కుటుంబ పోషణ భారమవుతోందని బాధితుల ఆందోళన



ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు(ఫైల్)

జియ్యమ్మవలస రూరల్:

ఉపాధి బిల్లులు సకాలంలో అందక వేతనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని వారాలుగా పనిచేసినా వేతనాల బిల్లులు చెల్లించడం లేదని వాపోతున్నారు. దీంతో తమ కుటుంబ పోషణ కష్టతరమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు తమవని, ఏ రోజు కూలిడబ్బులు ఆరోజు చెల్లిస్తేనే తమ పొట్ట నిండేదని ఇలా చేస్తే ఇంకెలా బతకాలని అటు ప్రభుత్వాన్ని, ఇటు అధికారులను వేతనదారులు నిలదీస్తున్నారు. ఇదివరకంటే ప్రతినెలా ఏదో ఒక పథకం డబ్బులు వచ్చేవని, సాఫీగా జీవనం సాగించేవారమని ఇప్పుడు అటువంటిదేమీ లేదని అంటున్నారు. ఇప్పటికైనా త్వరగా బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.

**మొత్తం 29,475 మంది..**

మండల వ్యాప్తంగా మొత్తం 29,475 మంది వేతనదారులు ఉన్నారు. వీరంతా గ్రామీణ ప్రాంతాల్లో జరిగే ఉపాధి హామీ పథకం పనుల పైనే ఆధారపడి వేసవికాల జీవనం సాగిస్తున్నారు. అయితే వారికి ఆరు వారాలుగా చేసిన పనికి సంబంధించి డబ్బులు చెల్లింపులు జరగలేదు. దీంతో వారంతా రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. వలసల నివారణే లక్ష్యంగా తీసుకువచ్చిన ఉపాధి పనులకు అసలు అర్థం లేకుండా చేస్తున్నారని బాధిత వేతనదారులు ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు. ఇలా అయితే మళ్లీ వలస బాట పట్టాల్సి వస్తాదని అంటున్నారు. ఇదిలా ఉంటే మార్చి, ఏప్రిల్, మే నెలల జీతాలు చెల్లించకపోవడంతో తాము కూడా ఇక్కట్లు పడుతున్నామని క్షేత్ర సహాయకులు చెబుతున్నారు.

**గోశాలల నిర్మాణదారులదీ అదే పరిస్థితి...**

ఉపాధి హామీ పథకంలో భాగంగా గోశాలలు, నీటితొట్టెలు, కాంపౌండ్ వాల్‌లు, ఫారంపాండ్స్ నిర్మించిన వారి పరిస్థితీ ఇదే రకంగా ఉంది. వారిలో చాలామందికి బిల్లులు చెల్లింపులు జరగలేదు. దీంతో వారు లబోదిబోమంటున్నారు. మొత్తం 158 మంది పాడిరైతులకు 56 నీటితొట్టెలు, మరో 51 కాంపౌండ్ వాల్ నిర్మాణాలకు ఇంతవరకు ఒక్క రూపాయి చెల్లించలేదు. ఈ నేపథ్యంలో ఫారంపాండ్స్ నిర్మాణం చేయించాలన్న రైతులను బతిమాలాడుకోవాల్సి వస్తోందని పలువురు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.

**బిల్లులు చెల్లించేందుకు చర్యలు..**

రూ.3.5 కోట్ల మేర గోశాలలు, కాంపౌండ్ వాల్‌లు, నీటితొట్టెలు, ఫారంపాండ్స్ నిర్మాణాలు జరిగాయి. ఆ పనుల బిల్లులు జనరేట్ చేశాం. త్వరలోనే వారందరి బిల్లులు చెల్లించేలా చొరవ తీసుకుంటున్నాం.

–తులసీదాస్, ఏపీవో, ఉపాధి హామీ పథకం

## ప్రత్యేక డీఎస్సీ ఇవ్వాలి



తహసీల్దారు రమణమ్మకు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ సంఘ నాయకులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): గిరిజనుల కోసం ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని ఆదివాసీ సంఘ నాయకులు ఎ.గంగారావు, బి.అనిల్ డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు కురుపాం మండల కేంద్రానికి గురువారం వెళ్లి, తహసీల్దారు ఎం.రమణమ్మకు వినతిపత్రం అందజేశారు. ఐటీడీఏ పరిధిలోని ఉపాధ్యాయ పోస్టుల్లో ఆదివాసీలకు కేవలం రెండు మాత్రమే కేటాయించారని దీంతో ఆదివాసీ నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లోని వందకు వంద పోస్టులను ఆదివాసీలతో భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలి



వసతిగృహాన్ని తనిఖీ చేస్తున్న జడ్జి సౌమ్య జాస్పిన్

జియ్యమ్మవలస రూరల్: విద్యార్థుల వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని జిల్లా అదనపు జడ్జి, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్య జోసెఫిన్ ఆదేశించారు. మండలంలోని బీజేపురం బాలుర వసతిగృహాన్ని గురువారం సందర్శించిన ఆమె.. అక్కడి విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించి, వార్డెన్‌కు పలు సూచనలు చేశారు. హాస్టల్ పునఃప్రారంభం నాటికి మరుగుదొడ్లు బాగుచేయాలని, రన్నింగ్ వాటర్ సదుపాయం ఉండేలా చూడాలని, పరిసరాలు పరిశుభ్రం చేయాలని తెలిపారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అక్కడి నుంచి చినమేరంగి వెళ్లిన ఆమె.. ఎస్సీ, బీసీ వసతిగృహాలను సందర్శించారు. కార్యక్రమంలో వార్డెన్ ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## బదిలీల నిబంధనలు మార్చాలి



పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

సీతంపేట: గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీల్లో నిబంధనలు మార్చాలని యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు ఆరిక భాస్కరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ.. పంచాయతీరాజ్, ప్రభుత్వ, మున్సిపల్ ఉపాధ్యాయులకు ఇచ్చిన జీఓ 22ను వెంటనే అమలు చేయాలన్నారు. హైస్కూల్ హెచ్‌ఎంలకు ఐదేళ్లు, మిగిలిన వారికి 8 సంవత్సరాల సీనియారిటీ తప్పనిసరి చేయాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీల్లో సర్వీస్ పాయింట్లు కలపాలని కోరారు.

బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులను బదిలీ చేయగా, మిగిలిన అన్ని క్యాడర్ పురుష ఉపాధ్యాయులను కూడా బదిలీ చేయాలన్నారు. జీపీఎస్ ఉపాధ్యాయులను జీపీఎస్ పరిధిలోనే బదిలీ చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కె.కృష్ణారావు, పి.కృష్ణారావు, బి.జయప్రకాష్, ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వాయర్ పూర్తి చేయాలని బైక్ యాత్ర




బైక్ ర్యాలీలో జంఝావతి ప్రాజెక్టు సాధన కమిటీ సభ్యులు

కొమరాడ: మండలంలోని రాజ్యలక్ష్మీపురం సమీపంలో జంఝావతి నదిపై అసంపూర్ణంగా ఉన్న రిజర్వాయర్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతూ జంఝావతి ప్రాజెక్టు సాధన సమితి ప్రతినిధులు, రైతులంతా బైక్ యాత్ర గురువారం చేపట్టారు. పార్వతీపురం నుంచి ప్రారంభమైన ఈ యాత్రలో ఆయనతో పాటు జంఝావతి సాధన సమితి కార్యాచరణ కన్వీనర్ మరిశర్ల మాలతి కృష్ణమూర్తి నాయుడు పాల్గొని, మాట్లాడారు. గత 40 ఏళ్లుగా ఒడిశా రాష్ట్రంతో నెలకొన్న ఓ చిన్నపాటి చిక్కుముడితో అసంపూర్తిగా నిర్మాణం ఉండిపోయిందన్నారు. నిర్మాణం పూర్తయితే రెండు నియోజకవర్గాల్లోని గ్రామాలకు సాగునీరు, తాగునీరు పుష్కలంగా అందుతుందన్నారు. కార్యక్రమంలో వి.దాలినాయుడు, పి.రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోండి

గరుగుబిల్లి: గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న ప్రజాసమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఎంపీపీ ఉరిటి రామారావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా మండల శాఖ అధికారులంతా ఒకరి తర్వాత మరొకరు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఈ క్రమంలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన గోశాలలు, నీటితొట్టెల నిర్మాణ పనులకు సంబంధించిన చెల్లింపుల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారన్న సమస్యలను నాగూరు ఎంపీటీసీ సభ్యుడు డి.సత్యనారాయణ సభ దృష్టికి తీసుకువచ్చారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు కనీస గౌరవం ఇవ్వకుండా ఉపాధి హామీ సిబ్బంది వ్యవహరిస్తున్నారన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ ఉపాధి హామీ సిబ్బంది నిర్లక్ష్యం వీడకపోతే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఎంపీడీవో జి.పైడితల్లి, పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### మండలానికి ఇద్దరు హెచ్‌ఎంలు..



మాట్లాడుతున్న ఎంఈఓ ఆనందరావు

వీరఘట్టం: ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంల బదిలీల్లో భాగంగా మండలానికి ఇద్దరు ప్రధానోపాధ్యాయులు రానున్నట్లు ఎంఈఓ ఆర్.ఆనందరావు తెలిపారు. గురువారం స్థానిక ఎంఆర్‌సీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తలవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఖాళీగా ఉన్న హెచ్‌ఎం పోస్టులో విజయనగరం జిల్లా రేగిడి మండలం దేవుదల హైస్కూల్ హెచ్‌ఎం సురగల రాజ్యలక్ష్మి బదిలీపై వస్తున్నట్లు తెలిపారు. అలాగే వీరఘట్టం మండలం కంబరవలస హైస్కూల్ హెచ్‌ఎం లక్ష్మికి వంజరాం హైస్కూల్‌కు బదిలీ కాగా.. ఆమె స్థానంలో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం హైస్కూల్ నుంచి బొద్దాన రామారావు బదిలీపై వస్తున్నట్లు చెప్పారు.

**హెచ్‌ఎంకు బదిలీ..**

సీతంపేట: స్థానిక జీహెచ్ స్కూల్ హెచ్‌ఎం యతిరాజ్యం హేమసుందర్‌కు శ్రీకాకుళం జిల్లా జలుమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బదిలీ జరిగింది. ఇక్కడకు విజయనగరం నుంచి హెచ్‌ఎం వెంకటరావు బదిలీపై రానున్నారని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

## అకాల వర్షాలతో పంటనష్టం



పెదబుడ్డిడిలో రోడ్డుపై తడిచిన నువ్వు చేను

జియ్యమ్మవలస: మండల వ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలతో పంటనష్టం వాటిల్లుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నిరోజులుగా ప్రతిరోజూ కురుస్తున్న వర్షాలకు చేతికి అందివచ్చిన నువ్వుచేను సహా పెసర, మినప పంటలు పాడయ్యాయని పలువురు రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా మండలంలోని పెదబుడ్డిడి, అంకవరం, చినబుడ్డిడి, జోగులడుమ్మ తదితర గ్రామాల్లోని రైతులు ఇప్పటికే తడిచిన నువ్వుచేనును ఎక్కడికీ తీసుకువెళ్లలేక ఎండ కోసం రోడ్డుపైనే ఉంచేశారు. ఏది ఏమైనా అకస్మాత్తుగా కురుస్తున్న వర్షాలు తమకు నష్టం కలిగించాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఆగని వర్షాలు..



పాలకొండ పరిసరాల్లో కురుస్తున్న వర్షం

పాలకొండ రూరల్: నైరుతి రుతుపవనాల ప్రభావంతో గడిచిన 48 గంటలుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం నాటికి ముసురు పట్టడంతో దాదాపుగా జనజీవనం స్తంభించింది. ముఖ్యంగా వ్యవసాయ ఆధారితమైన పాలకొండ నియోజకవర్గ పరిధిలో 43,310 మంది రైతులు ఖరీఫ్ సేద్యానికి సిద్ధమవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పటికే వేసవి దుక్కులు చేపట్టిన రైతులు వ్యవసాయానికి సమాయత్తం అవుతున్నారు. గడిచిన ప్రభుత్వ పాలనలతో ఈ సమయానికే పెట్టుబడి సాయంతో పాటు అధికారిక వ్యవసాయ ప్రణాళిక సిద్ధమయ్యేది. ఆర్‌బీకేల ద్వారా క్షేత్ర స్థాయిలో సేవలు అందేవి. ప్రస్తుత సీజన్‌లో ఎరువులు, విత్తనాలు అందించలేని పరిస్థితి నెలకొంది. వర్షాలు అనుకూలిస్తున్నా.. ప్రభుత్వం నుంచి సహకారం అందక సాగుకు ఇబ్బంది పడుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

## రూ. 2.20 లక్షలతో అభివృద్ధి పనులు



వడమ స్వర్గధామ విశ్రాంత భవనం వద్ద నిర్మాణ దాత

పాలకొండ రూరల్:

పట్టణంలోని వడమ ప్రాంతానికి చెందిన శ్మశానవాటిక అధ్వానంగా మారింది. ఆఖరి మజిలీలో భాగంగా మృతదేహాలను ఖననం చేసేందుకు శ్మశానికి తీసుకెళ్లేందుకు ఎన్నో ఇబ్బందులు పడాల్సి వచ్చేది. సమస్య గుర్తించిన అదే ప్రాంతానికి చెందిన పైల సూర్యనారాయణ, సావిత్రమ దంపతులు స్పందించి రూ. 2.20 లక్షల వ్యయంతో రుద్రభూమిని అభివృద్ధి చేశారు. అలాగే స్వర్గధామ విశ్రాంత భవనం నిర్మించారు. తమ కుటుంబ పెద్దలు అప్పయ్య, వలహాలమ్మ, రవికుమార్ నాయుడు జ్ఞాపకార్థం అభివృద్ధి పనులు చేపట్టినట్లు దాత సూర్యనారయణ తెలిపారు.

## దళితులు, మైనార్టీలపై బాబు సర్కార్ థర్డ్ డిగ్రీ

- వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు సరివిశెట్టి శ్రీనివాసరావు



పార్వతీపురం రూరల్: దళితులు, మైనార్టీలపై రాష్ట్రంలో చంద్రబాబు సర్కార్ బహిరంగంగానే థర్డ్‌డిగ్రీ ప్రయోగిస్తోందని వైస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు సరివిశెట్టి శ్రీనివాసరావు మండిపడ్డారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ తెనాలిలో ఇద్దరు దళితులు, ఒక మైనార్టీ యువకుడిపై పోలీసులు అత్యంత దారుణంగా ప్రవర్తించి థర్డ్ డిగ్రీ ప్రయోగించడం బాధాకరమన్నారు. రాజ్యాంగ విలువలను రాష్ట్ర ప్రభుత్వం ఉల్లంఘిస్తూ మానవ హక్కులను కాలరాస్తోందని ధ్వజమెత్తారు. అంతులేని అధికారంతో దళితులు, మైనార్టీలు, గిరిజనులు, బీసీల హక్కులను పోలీసులు గౌరవించకుండా టీడీపీ ప్రవేశపెట్టిన రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడం దారుణమన్నారు. లాఠీలతో కొడుతుంటే వారు బాధతో అరుస్తున్నా నవ్వుతూ పోలీసులు మళ్లీ అదే పనిగా పాశవికంగా దాడిచేయడం అన్యాయమన్నారు. బూటు కాళ్లతో ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తొక్కి పట్టగా, మరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లాఠీలతో దాడిచేశారన్నారు. అక్కడ మిగిలిన సిబ్బంది ఈ దాడిని వీడియో తీశారని, లాఠీ విరిగిపోతే నవ్వుతూ కొత్తవి అందజేశారన్నారు. ఈ ప్రభుత్వంలో ఎంతటి భయానక వాతావరణం రాష్ట్రంలో నెలకొందో చెప్పడానికి ఇదో ప్రత్యక్ష సాక్ష్యమన్నారు. ఇలాంటి ఎన్నో దారుణ, దాడులు రాష్ట్రమంతటా జరుగుతునే ఉన్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేస్తే కూటమి సర్కార్ థర్డ్ డిగ్రీ బలహీన వర్గాలపై ప్రయోగిస్తోందని మండిపడ్డారు.

## శ్రీరామాలయ ప్రతిష్ట ప్రారంభం

బలిజిపేట: మండలంలోని బర్లి గ్రామంలో శ్రీరామాలయ ప్రతిష్ట కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. అందులో భాగంగా గురువారం యర్ల రాంబాబు శాస్త్రి ఆధ్వర్యంలో ప్రతిష్టా కార్యక్రమాలు ప్రారంభించి శ్రీ మహాగణపతి పూజ, సంకల్పం, పుణ్యావహచనం, రక్షాబంధనం, పంచగవ్య ప్రాశన, యాగశాల ప్రవేశం, సంస్కారం, అంకురారోహణ, నవగ్రహ, యోగిని, వాస్తు, క్షేత్రపాలక సర్వతో భద్ర మంటప, మండల ఆవాహనములు, ఆరాధనలు నిర్వహించారు.

## రహదారిపై వర్షపునీటితో ప్రయాణికుల ఇక్కట్లు



పార్వతీపురం-రాయగడ అంతర్‌రాష్ట్ర రహదారి దుస్థితి

పార్వతీపురం రూరల్: చిన్న చినుకుపడితే రోడ్లు చెరువులను తలపించే విధంగా మారుతుండడంతో వర్షపునీటితో వాహన చోదకులు రాకపోకలకు అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంటోంది. గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా పట్టణాల్లో గల ప్రధాన, బైపాస్ రహదారుల్లో సగం వర్షపు నీటితో రహదారులు నిండి వాహన చోదకులు రహదారిపై వెళ్లేందుకు అంచనా వేయలేని విధంగా దర్శనమిస్తున్నాయి. దీంతో వర్షపునీటిలో రహదారిపై ఏర్పడిన గుంతలు ఎంత పరిమాణంలో ఉన్నాయో అంచనా లేక అదుపుతప్పి వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కూటమి ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి ఇచ్చిన హామీ నేటికీ ఆచరణకు నోచుకోకపోవడంతో రోడ్లు మరింత అధ్వానంగా తయారయ్యాయి. వర్షాలు ప్రారంభం కావడంతో రోడ్లపై ఉన్న గుంతలు మరింత పరిమాణంలో భారీ గుంతలుగా ఏర్పడి భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.